క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు బొల్లవరం విద్యార్థిని



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్ : మండలంలోని బొల్లవరం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాఘన్న మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలోని ఎస్పీజీ మైదానంలో జరిగిన అండర్–14 కబడ్డీ సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని శ్రీవల్లి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి నరసమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు ఎంపిక



దీప్తితో ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని దీప్తి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శంకర్ మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయి 17 సంవత్సరాల లోపు విభాగం యోగా పోటీలు పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరగనున్నాయన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని దీప్తి పాల్గొనేందుకు అర్హత సాధించిందని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం షహనాజున్నిస్మా దీప్తిని అభినందించారు.

కళాశాలను అభివృద్ధి చేయాలి

ఆత్మకూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కళాశాల అభివృద్ధి ప్రణాళిక మండలి చైర్మన్, కళాశాల ప్రిన్సిపల్ వెంకటనరసయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి ప్రణాళికపై సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని, కళాశాలలో సమస్యలు రాకుండా పరిష్కరించాలని చెప్పారు. ఇందుకు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు పువ్వాడ భాస్కర్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, రాజన్న, రాజేశ్వరమ్మ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికలు విద్యలో రాణించాలి

నందికొట్కూరు: బాలికలు విద్యలో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ తాజుద్దీన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు తొలగింపునకు చర్యలు

ఆత్మకూరు: పట్టణంలోని ఖబరస్తాన్‌లో ఆగి ఉన్న వర్షపు నీటిని తొలగించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు కాల్వలో పూడిక తీత పనులు మంగళవారం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఖబరస్తాన్‌కు వెళ్లే రహదారిలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇందుకు ప్రొక్లెయిన్‌తో ప్రత్యేక కాలువను తీయడమే కాకుండా, పాతకాల్వలో పూడిక తీత పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొమీన్, మునీర్‌బాషా, కలిలుల్లా, షరీఫ్, జిలానీ పాల్గొన్నారు.

బోటు నిర్వాహకులపై కేసు నమోదు

పగిడ్యాల: ప్రభుత్వ అనుమతి లేకుండా కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో మూర్వకొండ ఘాట్ నుంచి తెలంగాణ రాష్ట్రం మంచాలకట్టకు ఇంజిన్ బోటు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున మంగళవారం తెలిపారు. నెహ్రూనగర్ గ్రామానికి చెందిన గొడుగు వెంకట్రాముడు, కావలి వెంకటేశ్వర్లు, గొడుగు పక్కీరయ్య కృష్ణా బ్యాక్‌వాటర్‌లో ప్రైవేట్ వ్యక్తులను, ఇతర వస్తువులను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. నది పరివాహకం వెంట ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంజన్ బోట్లు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దసరా మహోత్సవాలకు ఆహ్వానం



సీఎస్‌ను ఆహ్వానిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణని దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారికి వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.



బండిఆత్మకూరులో వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న శిల్పా భువనేశ్వరరెడ్డి.



మండ్లెంలో 85ఏళ్ల వృద్ధురాలు బానూబీ యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్థర్



వడ్డెమానులో రోగులకు మందులను పంపిణీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో శారద



క్రిష్ణాపురంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



గుంతకందాల వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు గొప్పవరం లాంటిందని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. మంగళవారం మండలంలోని మండ్లెం–2 సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని తనిఖీ చేశారు. మొదట ఐసీడీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. అనంతరం కంటిపరీక్షల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. వైద్యులతో పాటు ప్రజలకు అన్నిరకాల పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను అందజేయాలన్నారు. అలాగే మెరుగైన వైద్యపరీక్షల కోసం కార్పొరేట్ ఆసుపత్రులకు పంపించాలని సూచించారు. వైద్యపరీక్షలు చేయించుకొనేందుకు వచ్చిన బానుబీ అనే 85ఏళ్ల వృద్ధురాలిని ఎమ్మెల్యే ఆప్యాయంగా పలు కరించటంతో అయ్యా మీరు చల్లగా ఉండాలి, జగన్ చల్లగా ఉండాలి.. పింఛన్ ఇంటివద్దకు తెచ్చి ఇస్తున్నారంటూ ఆనందభాష్పాలు రాల్చింది. మండ్లెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ఐదో తరగతి విద్యార్థులను జాతీయగీతాన్ని పాడాలని కోరాగా.. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఆలపించడంతో ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృపమ్మ, ఎంపీపీ సువర్ణమ్మ, తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జంగాలపెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

పాములపాడు: ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను నూరుపాళ్లు నిజం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలంలోని బానుముక్కల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యులు నిర్వహిస్తున్న పరీక్షలను, ఐసీడీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ రత్నరాధిక, డాక్టర్లు నాగలక్ష్మీదేవి, గులాబ్‌షా, వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు, కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి, వేంపెంట సర్పంచు మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



బానుముక్కలలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

ఇంటింటికీ వైద్యసేవలు

మహానంది: ప్రతి ఇంటికీ వైద్యసిబ్బందిని పంపించి వైద్యసేవలు అందిస్తూ సంపూర్ణ ఆరోగ్యం అందించమే జగనన్న సురక్ష లక్ష్యమని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ భావనరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు వైద్యసేవలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో 720 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ సంధ్య, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మద్దిలేటి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం

నందికొట్కూరు రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయని అడిషనల్ డీఎంహెచ్‌వో శారద తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎంపీడీవో శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ తిలకించారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

మిడుతూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని అడిషనల్ డీఎంహెచ్‌వో శారద తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 618 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఎస్ఎస్ రెడ్డి, ఎమ్మార్వో ప్రకాశ్ బాబు గ్రామ సర్పంచ్ మరియమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు వరం

ఆత్మకూరురూరల్: గ్రామాల్లోని నిరుపేద ప్రజలకు, నల్లమల చెంచులకు జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరం అని వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ రామక్రిష్ణారెడ్డి, వ్యవసాయమార్కెట్ కమిటీ అధ్యక్షుడు బాలస్వామి, ఆత్మకూరు తహసీల్దార్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

వెలుగోడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని జిల్లా అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారామ్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గుంతకందాల గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులను అడిగి.. అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ స్టాల్స్‌ను పరిశీలించి అక్కడి గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అచ్చెమ్మ, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ముసలిమడుగులో మందులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్, సర్పంచు



చెరుకుచెర్లలో కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి రఘురామయ్య

గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలు

కొత్తపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తోందని డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచు జమిలాబీ అన్నారు. మంగళవారం మండలంలోని ముసలిమడుగు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సౌజన్య లక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 505 మంది ఆరోగ్య పరీక్షలు చేశారు. 16 మందిని జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జబీర్, వినోద్ కుమార్, విజయేంద్ర వర్మ, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, ఉపసర్పంచ్ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

గుండె పరీక్ష చేయించుకున్నా..



నాకు 70 ఏళ్ల వయస్సు ఉంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా గ్రామాలలో ఇలాంటి కార్యక్రమం చేయలేదు. నేను గుండె ఆపరేషన్ చేయించుకున్నాను. క్యాంపులో మరలా గుండె పనితీరు కోసం ఈసీజీ తీపించుకున్నాను. డాక్టర్లు వైద్య పరీక్షలు బాగా చేస్తున్నారు. కార్యక్రమం గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– నీతమ్మ, ముసలిమడుగు గ్రామస్తురాలు

కొత్త కళ్లద్దాలు ఇస్తామన్నారు



కళ్ల పరీక్షచేశారు. ఇప్పుడు నేను వాడుతున్న కళ్లద్దాల టైం అయిపోయిందంట. ఉచితంగా కొత్త అద్దాలు ఇస్తామని డాక్టరు చెప్పారు. ఈ అద్దాలు కొనాలంటే రూ.1000 పైనే ఖర్చు అవుతుంది. గ్రామానికి వచ్చి ఉచితంగా పరీక్షలు చేసి, అద్దాలు కూడా ప్రభుత్వమే ఇవ్వడం చాలా మంచిదే.

–గడ్డం స్వామన్న, బానుముక్కల

ఈసీజీ తీశారు



నాకు అయాసం ఉంది. బీపీ పరీక్ష చేశారు. ఈసీజీ తీయాలని చెప్పి తీశారు. బయట ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి చేయించుకోవాలంటే చాలా ఖర్చు అవుతుంది. మా ఊరికి వచ్చి డాక్టర్లు ఈసీజీ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. గ్రామాలకు పెద్ద డాక్టర్లు వచ్చి పరీక్షలు చేయడం వల్ల చాలా మందికి ఎంతో మంచిదైంది.

–సామేలు, బానుముక్కల

వైద్య సహాయం సంతృప్తి నిచ్చింది



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సహాయం ఎంతో సంతృప్తినిచ్చింది. అయాసం, దగ్గుతో బాధపడుతూ ఇక్కడికి వచ్చాను .పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.

– సుబ్బయ్య,క్రిష్ణాపురం

మానసిక వికలాంగుల హక్కులకు భంగం కలిగించొద్దు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి



సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

ఆత్మకూరు /ఆత్మకూరు రూరల్: మానసిక వికలాంగుల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మానసిక వికలాంగులకు సమాజంలో మిగతా వారివలె జీవించే హక్కు ఉందని, వారికి మానవతాదృక్పథంతో సహకరించాలన్నారు. వారికి వైద్య సేవలతో పాటు ఆరోగ్యవంతులుగా అయ్యేంత వరకు కుటుంబ సభ్యులు సేవలు అందించాలని చెప్పారు. అనంతరం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ వైద్యాధికారి రాయుడు, వెంకటరమణ, అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది బాబు రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎలాంటి సమస్య వచ్చినా కోర్టును ఆశ్రయించాలి

నందికొట్కూరు: శారీరక వికలాంగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా కోర్టును ఆశ్రయించాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని సూచించారు. మంగళవారం పట్టణంలోని సంతపేట స్కూల్‌లోని భవిత కేంద్రంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఉద్దేశించి జడ్జి మాట్లాడారు. మానసిక వికలాంగత్వాన్ని కలిగిన పిల్లలను చిన్న చూపు చూస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం భవిత కేంద్రంలోని పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఫైజున్నీసాబేగం, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, న్యాయవాదులు శరబయ్య, వెంకటేశ్వర్లు, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవత్వంతో ప్రజలకు సేవ చేయాలి



లబ్ధిదారుడికి సంక్షేమ బావుటా పుస్తకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పగిడ్యాల: సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల మానవత్వంతో సేవ చేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం నెహ్రూనగర్ సచివాలయం 1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ బావుటా పుస్తకాలను పంపిణీ చేస్తూ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పార్టీలకతీతంగా పేద ప్రజలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. రాబోయే ఎన్నికలలో మళ్లీ జగనన్న సీఎం చేసుకునేందుకు మద్దతు తెలపాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులు పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రమణ, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయివిజయ, శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఎత్తిపోతల పథకం మంజూరయ్యేలా చేస్తాం

జూపాడుబంగ్లా: మండ్లెం, భాస్కరాపురం, తంగడంచ పొలాలకు సాగునీరు అందించేందుకుగాను త్వరలో నూతన ఎత్తిపోతల పథకం మంజూరయ్యేలా చేస్తామని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ రైతులకు భరోసానిచ్చారు. మంగళవారం మండ్లె గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేను ఆయా గ్రామాల రైతులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన ఎత్తిపోతల పథకానికి సంబంధించి డిటెయిల్డ్‌ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేయించాలని సీఎం సూచించడంతో వాటిని జలవనరులశాఖ అధికారులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. సమగ్ర నివేదికలు సిద్ధంగా కాగానే ఎత్తిపోతల పథకం మంజూరు చేయిస్తానని చెప్పారు. ఈ విషయమై రైతుల ఎదుటనే ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్నారు.

ఇంటికి చేరుకున్న వినయ్

ఆత్మకూరు: పట్టణంలో రెండు రోజులుగా సంచరిస్తున్న 12 ఏళ్ల బాలుడు వినయ్ మంగళవారం నెల్లూరులో ఉన్న తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నాడు. పని కావాలని పట్టణంలోని దుకాణాల వద్ద తిరుగుతున్న వినయ్ గురించి వైకేపీ సీసీ యూసఫ్ ఆరా తీసి, తల్లిదండ్రుల సమాచారం తెలుసుకొని సోమవారం బస్సు ఎక్కించి నెల్లూరుకు పంపిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం తెల్లవారుజామున నెల్లూరుకు చేరుకున్న వినయ్‌ను అక్కడి సీసీ మస్తాన్‌వలి బస్టాండ్ నుంచి ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు వెలుగు సీసీలైన యూసఫ్, మస్తాన్‌వలిలకు కృతజ్ఞతలు తెలిపారు.



తల్లిదండ్రులతో వినయ్

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నందికొట్కూరు రూరల్ : భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను తొలగించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అధికారులు ఎలాంటి తప్పులు లేకుండా వీలైనంత త్వరగా భూ సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో భూసర్వే డీటీ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

విద్యుత్ తీగలను సరిచేయండి



చేతికందే ఎత్తులో ఉన్న తీగలు

జూపాడుబంగ్లా: పొలాల వద్ద విద్యుత్ కిందికి వేలాడతున్నాయని, సమస్యను పరిష్కరించాలని అనేక మార్లు ట్రాన్స్‌కో ఏఈ రామాచారి, విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని కనకయ్యకొట్టాల గ్రామ రైతులు సుంకన్న, చిన్నన ర్సన్న, సుధాకర్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్తంభాలు కిందపడి విద్యుత్ తీగలు వేలాడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విషయాన్ని అధికారులు పట్టించుకోకపోవటంతో 1092కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా.. ట్రాన్స్‌కో ఏఈ రామాచారి వచ్చి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని నచ్చజెప్పి తమతో సంతకం చేయించుకొని వెళ్లారన్నారు. 20రోజులైనా సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

మహానంది: తమ్మడపల్లె గ్రామానికి చెందిన కమలపురి వెంకటేశ్వర్లు(42) సోమవారం మృతి చెందడంతో ఆయన భార్య లింగమ్మకు వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయం అందించినట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. మంగళవారం జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ చాబోలు సాలమ్మతో కలిసి లింగమ్మకు రూ. పదివేలు అందించారు.

పాఠశాల పునఃప్రారంభానికి కృషి

కొత్తపల్లె: మూతపడిన మండల పరిధిలోని కపిలేశ్వరం ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని మంగళవారం ఉమ్మడి కర్నూలు జిల్లా జెడ్పీ సమావేశంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి అధికారులను కోరారు. అలాగే జానాల గూడెం గిరిజన పాఠశాలను కూడా పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని నంద్యాల డీఈఓ కె. సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించడంతో ఆయా గ్రామాల ప్రజలు జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.



జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి సమక్షంలో డీఈఓ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ

గ్రామాభివృద్ధి ప్రణాళికపై అవగాహన

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక తయారీపై మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎలాంటి మౌళిక వసతులు కల్పించాలి, ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పరిశుభ్రతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువత్సల, పీఆర్‌ఏఈ సుబ్బయ్య, ఎంఈఓ జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం

ఆత్మకూరు: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం అన్నారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో మంగళవారం సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బ్రిటీష్‌కాలం నాటి 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేయడం సరికాదన్నారు. సత్వరమే ఈ చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు రణధీర్, రాముడు, కలిముల్లా, సుబ్బయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు 'గోరుముద్ద' ఇవ్వాలి

పాములపాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద పథకం పునఃప్రారంభించాలని ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమార్, కార్యదర్శిగా విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా రాము, నరేష్, సహాయ కార్యదర్శిగా ప్రవీన్ తదితరులను ఎన్నుకున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పాములపాడు: భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాటం ప్రకాష్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో గ్రంథాలయ నిధులు రూ.16లక్షలతో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడవద్దని, పనులు గడువులోగా ముగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖాధికారి క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో ఖాళీలను భర్తీ చేస్తాం

మహానంది: మండల పరిధిలోని ఎంసీ ఫారంలో ఉన్న ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బోర్డు మెంబర్లు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మురళీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బోర్డుమెంబర్లు కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించి, పలు అంశాలపై చర్చించారు. వారు మాట్లాడుతూ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆడిటోరియం, బాలికల వసతిగృహాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. దీంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఎన్‌డీఎల్–7, ఎన్‌డీఎల్‌ఆర్–8 రకాల వరి విత్తనోత్పత్తికి వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రామారావు సూచనల మేరకు పది ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో శనగ విత్తనోత్పత్తికి మరో 20 ఎకరాలు కేటాయిస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ నాయక్, ప్రొఫెసర్లు డాక్టర్ మల్లేశ్వరరెడ్డి, వెంకటేష్‌నాయక్, డాక్టర్ ఎంఎస్ రాహుల్ పాల్గొన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న బోర్డు మెంబర్లు